క్లుప్తంగా

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేయండి

పిడుగురాళ్ల: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు పర్యటన విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పిడుగురాళ్ల పట్టణ, మండల కన్వీనర్లు కిరణ్ కుమార్, చింతా సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలంలో రెంటపాళ్ల గ్రామానికి రానున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా హాజరుకావాలని కోరారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో నీటి సరఫరాకు గురువారం అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొర్జంపాడు సబ్ స్టేషన్ వద్ద ఉన్న మెయిన్ వాటర్ పైపు లైన్ లీకేజ్ మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలివేయనున్నట్లు వివరించారు.

భవిష్యత్ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలి



రెంటచింతల: భావితరాల ఉజ్వల భవిష్యత్ కోసం పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని మాచర్ల నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు పోకూరి కాశీపతి అన్నారు. స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, బీజేపీ నాయకులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బి.నాగిరెడ్డి, నాయకులు పి.మట్టారెడ్డి, కె.రాజేశ్వరరావు, ఎం.సురేష్‌బాబు, పి.కుమార్, షేక్ చిన్న హుస్సేన్, వై.నేతాజీ పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు



జెట్టిపాలెం(రెంటచింతల): స్థానిక ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో 2025- 2026 విద్యాసం వత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు ఈ నెల 25 తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ కె.పాపయ్య మంగళవారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని, ఆంగ్లంలో బోధన ఉంటుందని, ఎటువంటి ఫీజులు ఉండదన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి పాస్ అయి ఉండాలని చెప్పారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 10వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కుల మెరిట్, రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9182958496 సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పిడుగురాళ్ల: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.సైదారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. మహవీర్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని పిల్లుట్ల రోడ్డు, మాయాబజార్, పోలీస్ స్టేషన్ నుంచి తహసీల్దార్ ఆఫీస్, ప్రజాశక్తి నగర్, బెల్లంకొండ డొంక ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాచవరంలో పర్యటించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పర్యటించారు. వారు ఆ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ పొలెపోగు రాములు మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు అమలుపరచాలన్నారు. మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భించి 31 సంవత్సరాలు కావస్తుందన్నారు. వచ్చే నెల 7న తేదీన ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మక్కెన పుట్టయ్య మాదిగ, చిలకా దేవదానం, జిర్రా ప్రభు, చిలకా నాగేశ్వరరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్లకు ఆదరణ లేక..

- నెలరోజుల్లో రెండు థియేటర్లు మూత
- ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోతున్న సినిమాలు
- ఓటీటీ రాకతో థియేటర్‌కు వచ్చేందుకు ప్రేక్షకుల విముఖత



30 రోజులుగా సినిమాలు లేక మూతబడిన నాగార్జున కళామందిర్

మాచర్ల రూరల్: ఒకప్పుడు సినిమా విడుదల అంటే పల్లె, పట్టణం లేదా లేదు.. ఊరుంతా పండుగ వాతావరణం. టికెట్ దొరకతే ఆ ఆనందం లెక్కవేరు. అర్ధరాత్రి నుంచి అభిమానులు థియేటర్ల వద్ద బారులు తీరేవారు. అప్పట్లో ఏడాది కాలంగా ఒకే థియేటర్‌లో సినిమా ప్రదర్శించిన రోజులున్నాయి. ప్రస్తుతం రోజులు మారాయి. వినోద రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఓటీటీలు రాకతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

పట్టణంలో ఇలా..

మాచర్ల పట్టణంలో నీలిమా డీలక్స్, శ్రీ రామా టాకీస్, శ్రీనివాస మహల్, నాగార్జున కళామందిర్, శ్రీ వెంకటేశ్వర థియేటర్‌లు ఉండేవి. చంద్రవంక నూతన బ్రిడ్జి నిర్మాణంతో నీలిమా డీలక్స్ సినిమా హాలు వాగు నీటి ప్రవాహంతో థియేటర్‌కు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుండటంతో 20 ఏళ్ల క్రితం ఆ థియేటర్‌ను పూర్తిగా మూసివేశారు. ప్రస్తుతం నాలుగు థియేటర్లు ప్రేక్షకులకు వినోదాన్ని అందిస్తున్నాయి. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో శ్రీ రామాటాకీస్, నాగార్జున కళామందిర్ ప్రేక్షకులు రాకపోవటంతో సినిమాలు రిలీజ్‌లు లేకపోవటంతో నెల రోజుల నుంచి ఆ రెండు థియేటర్లు మూసివేశారు.



పూర్తిగా మూతబడిన నీలిమా థియేటర్

మల్టీప్లెక్స్‌లు రాకతోనూ...

మల్టీప్లెక్స్ వచ్చిన తరువాత సింగిల్ స్క్రీన్‌కు వెళ్లేందుకు ప్రేక్షకులు అంతగా ఆసక్తి చూపటం లేదు. కరోనా వచ్చిన తరువాత సినిమా థియేటర్లు నిర్వహణ సాధ్యం కాని పరిస్థితి నెలకొంది. అద్దె ప్రాతిపదికన నిర్వహించటం, డిస్ట్రిబ్యూటర్లుకు, ఎగ్జిబిటర్లు తమ వల్ల కావడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం సింగిల్ థియేటర్లకు సినిమా విడుదల చేసే సమయంలో ఒప్పందాలు చేసుకుంటున్నారు. మల్టీప్లెక్స్‌కు షేరు విధానం అమలు చేస్తున్నారు. అద్దె ప్రతిపాదన వలన ఆర్థికంగా నష్టపోతున్నట్లు సింగిల్ థియేటర్లు నిర్వాహకులు వాపోతున్నారు. భారీ బడ్జెట్ చిత్రాల విడుదల చేసినా కొన్ని రోజుల వరకు రేట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తుంది. దీని వలన డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతకు మాత్రమే ప్రయోజనం జరుగుతుందని, తమకు న్యాయం జరగటం లేదని చెబుతున్నారు.

అతిసారంపై అప్రమత్తతే సురక్షితం

పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

ముప్పాళ్ల: అతిసారంపై అప్రమత్తతే సురక్షితమని, అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమని పీహెచ్‌సీ వైద్యురాలు పీ రమాదేవి చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ జూలై 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లోను అతిసార వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అతిసార వ్యాధి మరణాలు లేకుండా చేయటమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. అతిసార రాకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎల్లప్పుడూ మరుగుదొడ్డిని ఉపయోగించాలని సూచించారు. చిన్నపిల్లల్లో అతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఏ పీటర్‌డేమియన్, ఎం.జోస్పిన్‌రాణి, స్టాఫ్‌నర్స్ రాధ, కామాక్షి, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు

క్రోసూరు: అతిసార వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు జూలై 31వ తేదీ వరకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులు డాక్టర్ సిరి చందన, డాక్టర్ రాంబాబునాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్‌లు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలోని సమావేశ హాలులో మంగళవారం 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ' పోస్టర్లను ఆవిష్కరించారు. డాక్టర్ సిరి మాట్లాడుతూ వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా అతిసార ప్రబలే అవకాశం ఉందని, దీని కారణంగా మరణాలు ముఖ్యంగా ఐదు సంవత్సరాలలోపు పిల్లల మరణాలు సంభవించకుండా నివారించడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని అన్నారు. డాక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు 2 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 14 జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జానీబాషా, మేల్ స్టాఫ్‌నర్స్ వీరయ్య, ఫార్మసిస్ట్ ఫాతిమా, ఆరోగ్య,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యడ్లపాడు బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు

ఒకే భవనంలో హైస్కూల్ నుంచి కళాశాల విద్య వరకు ఉచితం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి భాగంగా మంగళవారం స్థానికంగా విద్యా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాల హెచ్ఎం జి.విజయభారతి మాట్లాడుతూ, పదవ తరగతి పూర్తిచేసిన బాలికలు ఇంటర్మీడియట్ చదువు కోసం యడ్లపాడు జెడ్పీ బాలికల జూనియర్ కళాశాలను ఎంచుకోవాలని తల్లిదండ్రులను కోరారు. తమ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఇంగ్లీష్ మీడియంలో ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. పేద విద్యార్థులకు ఏ రకమైన ఆర్థిక భారం లేకుండా ఉచిత బస్‌పాస్, నోటుపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, మూడు జతల యూని ఫామ్స్, బ్యాగు, బూట్లు, బెల్టు, మెజోళ్ళు లభిస్తాయని ఆమె తెలిపారు. అలాగే, 'తల్లికి వందనం' పథకం కింద ప్రతి విద్యార్థిని తల్లికి రూ.13 వేల నగదు అందిస్తారని వివరించారు. భద్రతతో పాటు క్రమశిక్షణతో తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అడ్మిషన్ల కోసం లెక్చరర్ డి.సుధీర్ సెల్‌నం: 99898 03686ను సంప్రదించవచ్చని సూచించారు. ఇదే పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాల బాలికలకు ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగుతోందని, గతేడాది సప్లిమెంటరీలతో కలిపి 100 శాతం ఫలితాలు సాధించామని పాఠశాల సిబ్బంది వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమంలో జూనియర్ కళాశాల, హైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్‌తో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ



మాట్లాడుతున్న షేక్ సాదిక్

చిలకలూరిపేట: దీర్ఘకాలిక వ్యాధులున్న బీపీ, షుగర్, హార్మోన్ల అసమతుల్యత, చర్మవ్యాధుల వంటి వాటి నివారణకు ఆక్యుపంక్చర్ వైద్య విధానం ఎంతో సమర్ధవంతంగా పనిచేస్తుందని ఆక్యుపంక్చర్ థెరపిస్ట్ షేక్ సాదిక్ చెప్పారు. పట్టణంలోని గవర్నమెంట్ పెన్షనర్స్ అసోయేషన్ హాలులో లైఫ్ ఆక్యుపంక్చర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆక్యుపంక్చర్ థెరపిపై అవగాహన, ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో యువత శారీరక, మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వెన్ను నొప్పి, జుట్టు రాలడం, మానసిక ఆందోళనలతో బాధపడు తున్నారని వివరించారు. అలాగే వయసు పెరిగిన వారు బీపీ, షుగర్, థైరాయిడ్, పక్షవాతం, వేరికోస్‌వెయిన్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ వ్యాధులన్నింటికీ ఆక్యుపంక్చర్ విధానంలో సహజసిద్ధంగా నివారించవచ్చని వివరించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్యం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లంకా ఆదినారాయణరెడ్డి, కె.మురళీధరరావు, జి.వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల అడహక్ కమిటీ చైర్మన్‌గా రాజన్‌బాబు

అచ్చంపేట: మండలంలోని గ్రంథశిరి ఎత్తిపోతల పథకానికి అడహక్ కమిటీ చైర్మన్‌గా సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబును నియమిస్తూ ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం రాజన్‌బాబు ఉత్తర్వుల కాపీలను విలేకరులకు చూపించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు 2025 ఖరీఫ్ సీజన్ నాటికి స్కీము మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామన్నారు. ఇప్పటికే మరమ్మతు పనులు జరుగుతున్నాయని, విద్యుత్ శాఖాధికారుల సహకారంతో స్కీముకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతానన్నారు.

నోటీసులు ఇవ్వకుండా అడహక్ కమిటీ..

అడహక్ కమిటీని వేసేటప్పుడు సంబంధిత ఇరిగేషన్ శాఖ నుంచి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని, నోటీసులు ఇవ్వకుండా, తన నుంచి వివరణ తీసుకోకుండా ఎలా అడహక్ కమిటీ వేస్తారని ప్రస్తుత చైర్మన్ రావెళ్ల నరసింహారావు ప్రశ్నించారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం



పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మార్గదర్శకాలతో స్థానిక ఎస్‌బీఐ బ్రాంచిలో రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో 27 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసినట్లు చెప్పారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన చీఫ్ మేనేజర్ దేవేంద్రనాథ్‌ను అభినందించారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, వైస్ చైర్మన్ పీవీఎం శరత్ బాబు, కోశాధికారి గంధ్రకోట మురళీకృష్ణ, చీఫ్ మేనేజర్ దేవేంద్రనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



రెంటచింతల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వెల్దుర్తి మండలం మండాది గ్రామానికి పులి కేశవరెడ్డి గురజాల వెళ్లి స్వగ్రామం మండాదికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా రాత్రి కావడంతో ఎదురుగా వస్తున్న వాహనం హెడ్‌లైట్ కాంతికి డివైడర్‌కు బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనానికి సమాచారం ఇవ్వగా క్షతగాత్రున్ని గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేశవరెడ్డి మాచర్ల పట్టణంలోని ఓ విత్తనాదుకాణంలో పని చేస్తున్నాడు.

వృద్ధుల పరిరక్షణకు అనేక చట్టాలు

ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు

సత్తెనపల్లి: వృద్ధుల పరిరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా న్యాయసేవాధికర కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు, సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ జడ్జి) వి.విజయ్ కుమార్ రెడ్డి సూచనల మేరకు ఈ నెల 15 తేదీ నుంచి 19 వరకు వృద్ధుల వేధింపుల నివారణపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా మంగళవారం పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ అనాథ వృద్ధుల ఆశ్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలో ఎంత మంది వృద్ధులు ఉన్నారు.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చట్టపరమైన అవసరాలు తలెత్తితే సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీకి తెలియజేయాలని, ఆశ్రమ స్థాపకులు ఆరేపల్లి కొండలకు సూచించారు. కేవలం ఒక్క ఫోన్ కాల్ ద్వారా అవసరమైన న్యాయ సేవలు అందించబడతాయన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు వృద్ధుల పరిరక్షణ చట్టాల గురించి తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు కొండలు, పారాలీగల్ వలంటీర్లు షేక్ ఖాజా, ముబారక్, వృద్ధులు ఉన్నారు.

21న పున్నారావు సంస్మరణ సభ

నరసరావుపేట: దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ దేవరపల్లి పున్నారావు సంస్మరణ సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ప్రజలకు పిలుపు ఇస్తూ మంగళవారం బస్టాండ్ సెంటర్‌లో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన పీడీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ పున్నారావు 18వ సంస్మరణ సభ విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనికి వక్తలుగా పీడీఎం రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటేష్, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, పౌరహక్కుల సంఘ రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ప్రజా కళామండలి వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీఐ రాష్ట్ర నాయకులు అబ్రహం లింకన్, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు శిఖనం చిన్న, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పత్తి దిగుబడులపై దృష్టి పెట్టాలి



పత్తి పొలంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సంధ్యారాణి



సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి

పిడుగురాళ్ల: పత్తి పంట ఎదుగుదలపై రైతులు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి అన్నారు. మండలంలోని జానపాడులో పొలం పిలుస్తోంది మంగళవారం నిర్వహించారు. పత్తి పంట క్షేత్ర సందర్శన చేసి పంటలో 30, 60 రోజులకు మెగ్నీషియం ఒక ఎకరానికి ఒక కిలో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వరి ఓ NM&1638 అనే రకం 45 నుంచి 50 బస్తాలు దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. రకాన్ని సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ చౌదర్ రెడ్డి పాల్గొన్నారు.

విత్తన కొనుగోలు రశీదు తప్పనిసరి

మాచవరం: ఖరీఫ్ పంటలు సాగు చేసే రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో దుకాణదారుల నుంచి తప్పని సరిగా రశీదు తీసుకోవాలని ఏఓ కె.రామమ్మ కోరారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఎం.నర్సయ్య, ఆయా గ్రామాల రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

మాచర్ల రూరల్: రైతులు విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పాప కుమారి కోరారు. మంగళవారం మండలంలోని కంభంపాడులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ఆధికృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా బిల్లును తప్పనిసరిగా తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు ఆ బిల్లును భద్రపర్చుకోవాలని సూచించారు. మెట్ట పంట వేసే ముందు పచ్చిరొట్ట పైరును వేసుకోవాలని, సాగు చేసే ప్రతి పంటను రైతు సేవా కేంద్రాలలో పంట నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు దొంగరి అనూరాధ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడులు

రెంటచింతల: సేంద్రీయ ఎరువులతోనే అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం మిట్టగుడిపాడు, గోలి గ్రామాలలో నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు సేంద్రీయ ఎరువుల వినియోగం, పత్తి పంటకు ఆశించే గులాబిరంగు పురుగు, వివిధ రకాల తెగుళ్ల నిర్మూ లనకు రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. సాగు భూములకు సేంద్రీయ ఎరువులను వేసుకున్నట్లు అయితే పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సంవృద్ధిగా లభించి తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. వేసవిలో లోతు దుక్కులను దున్నుకోవాలని సూచించారు. పంటలు వేసే ముందు పచ్చిరొట్టపైరును, పశువుల ఎరువును వేసుకోవాలని చెప్పారు. పత్తిపంటలో రసంపీల్చు పురుగు నివారణకు వేపకాషాయంను పిచికారీ చేసుకోవాలని కోరారు.

పొగాకు రైతుల పరిస్థితి ఆందోళనకరం

నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు

చిలకలూరిపేట: పొగాకు రైతుల పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని... గిట్టుబాటు ధరలేక ఇద్దరు రైతులు ప్రాణాలు తీసుకోవడానికి ఎవరు బాధ్యత వహిస్తారని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు ప్రశ్నించారు. నాదెండ్ల మండలానికి చెందిన ఇరువురు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం పై మీడియాతో మంగళవారం మాట్లాడారు. రైతుల చావుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు కంపెనీల చేత కొనిపిస్తామని బలంగా రైతులకు చెప్పిందని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పొగాకు కంపెనీలతో మాట్లాడుతున్నారని, కంపెనీలు కొనకపోతే ప్రభుత్వమే కొంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నమ్మబలికారని వెల్లడించారు. దీంతో పాటు పొగాకులో రెండు గ్రేడ్లకు సంబంధించి రూ. 12 వేలు, రూ. 6వేల చొప్పున కొంటామని హామీ ఇచ్చారన్నారు. అయితే మూడు నెలలుగా వాయిదాలు వేయడం తప్పించి చేసిందేమి లేదన్నారు. ఈ నెల ఐదోతేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తామని, తిరిగి 17 నుంచి మంత్రి వచ్చి ప్రారంభిస్తారని వాయిదాలు వేయడం తప్పితే ఆచరణకు నోచుకోలేదన్నారు. మంత్రి వస్తున్నట్లు పత్రికా ప్రకటనలు ఇచ్చి, సాంకేతిక కారణాలు చెప్పి మంగళవారం కూడా కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. అప్పులు చేసి పొగాకు పండిస్తే కొనుగోలు చేయాల్సిన కంపెనీలు నాణ్యమైన పొగాకు మాత్రమే తీసుకురమ్మని తిప్పి పంపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల చేత పొగాకు కొనిపించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొనిపిస్తామని రైతులకు హామీ ఇచ్చిన ప్రభుత్వం కంపెనీలను ఏమీ చేయలేక పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పొగాకు అమ్మినా ఖర్చులు కూడా రావని పొగాకును పొలంలో చిమ్మితే కనీసం ఎరువుగానైనా పనికి వస్తుందని రైతులు భావించే పరిస్థితి దాపురించటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు.

విద్యార్థుల ఎదుగుదలలో గురువులదే కీలకపాత్ర

విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి



నడికట్టు రామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాదెండ్ల: సమాజంలో విద్యార్థుల ఎదుగుదలకు తల్లిదండ్రుల తర్వాత గురువులదే కీలకపాత్ర అని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. మండలంలోని చిరుమామిళ్ళ శ్రీ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బదిలీ అయిన ఉపాధ్యాయులకు, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సముచితమైన స్థానం ఉందని, పదోతరగతి పరీక్ష ఫలితాల్లో వరుసగా నూరుశాతం ఫలితాలు సాధించి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ఉత్తమ ఫలితాలకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో కూడా మంచి ఫలితాలతో పాఠశాలకు, గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జిల్లాలో అన్ని మౌలిక వసతులు కలిగిన పాఠశాలల్లో చిరుమామిళ్ళ ఉన్నత పాఠశాల ఒకటని, పాఠశాల అభివృద్ధికి రామిరెడ్డి అందించే చేయూత ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హెచ్ఎంలు శ్రీనివాసరావు, కరిముల్లా, ఎం సుందరరావు, కిషోర్, ఉపాధ్యాయులు వైజే రాములు, నాగమహేష్, వినీల, నీరజ, గోపి, ఆదిలక్ష్మి, సంజీవయ్య, పీడీ నాగరాజులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలు అందించారు. అనంతరం ప్రాథమిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాదాత నడికట్టు రామిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో శివారెడ్డి, వెంకటరెడ్డి ఉన్నారు.

వారంలోగా వార్షిక ప్రణాళికలు పూర్తి చేయాలి

యడ్లపాడు మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్.నాగలక్ష్మి

యడ్లపాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం, 2025వ సంవత్సరానికి సంబంధించి ఆరవ మండల మహిళా సమైక్య సమావేశం అధికారులు నిర్వహించారు. యడ్లపాడు మండల సమైక్య అధ్యక్షురాలు ఆర్.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో డ్వాక్రా సంఘాల ప్రగతిని సమీక్షించడమే కాక, పలు కీలక అంశాలపై చర్చించి, కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 1342 డ్వాక్రా సంఘాలు, 39 గ్రామైక్య సంఘాలు, 35 మంది వీఏవోలు ఉన్నాయని, ఆయా సంఘాలు తమ వార్షిక ప్రణాళికలో భాగంగా ఇప్పటికే 846 గ్రూపులు 86శాతం పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 387 గ్రూపుల పనులను మరో వారంరోజుల వ్యవధిలోగా పూర్తి చేయాలని సంబంధిత వీవోఏ, సీసీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డ్వాక్రా సంఘాల వీవో పుస్తకాలను ఈ నెలాఖరుకు పూర్తి చేసి, 2025-26 ఆర్థిక సంవత్సర ఆడిట్‌కు సిద్ధంగా ఉంచాలన్నారు. ఇది ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సమగ్రంగా చేయాలని పేర్కొన్నారు. స్త్రీ నిధి-ఉన్నతి, సీఐఎఫ్ రికవరీని 100 శాతం పూర్తి చేయాలని జిల్లాస్థాయి నుంచి వచ్చిన సూచనల ఆధారంగా తెలియజేశారు. ప్రధానంగా మహిళా సంఘాల ప్రగతి, కార్యాచరణ, పథకాల అమలు, రికవరీ, ఆడిట్ లాంటి అంశాలపై స్పష్టత ఇచ్చి, ముందున్న లక్ష్యాలను చేరుకునే దిశగా సమైక్య సంఘాల దృష్టిని కేంద్రీకరించాలని అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముందస్తు ప్రణాళిక రూపకల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.